ఆ విద్యార్థులకు అంబేద్కర్ వర్సిటీలో ప్రత్యేక అడ్మిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాత బ్యాచ్‌ల విద్యార్థులకు ఆ కోర్సు పూర్తి చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం (స్పెషల్ రీ-అడ్మిషన్) కల్పిస్తున్నట్టు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 1991 నుంచి 2011 డిగ్రీ (బిఎ/బికాం/ బిఎస్‌సి) బ్యాచ్‌లకు చెందిన విద్యా ర్థులకు విశ్వవిద్యాలయం ప్రత్యేక అడ్మిషన్ పొందడానికి అవకాశం కల్పిస్తున్నదని పేర్కొ న్నారు. గతంలో విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల్లో చేరి, సకాలంలో కోర్సు పూర్తి చేయలేక పోయిన (ఓల్డ్ బ్యాచ్) విద్యార్థులకు వాటిని పూర్తి చేయడానికి ప్రత్యేక అవకాశం ఇస్తున్నట్టు వివరించారు. ప్రత్యేక అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులందరూ, జూబ్లీ హిల్స్ (హైదరాబాద్) లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్, విద్యార్థి సేవల విభాగాన్ని సంప్ర దించాలని కోరారు. ఆ విద్యార్థులకు ఇదే చివరి అవకాశ మని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు విశ్వవిద్యాలయ కాల్ సెంటర్: 18005990101, హెల్ప్ డెస్క్ : 7382929570 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ ఆత్మ గౌరవానికి 'బతుకమ్మ' ప్రతీక : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ, తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిందని సిఎం కెసిఆర్ అన్నారు. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా జరుపుకుంటూ, తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా గౌరవిస్తుందని అన్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై, ఉత్సవాల ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ దాకా తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలంతా ఆటా పాటలతో కోలాట చప్పట్లతో కలిసికట్టుగా జరుపుకునే బతుకమ్మ సంబురాలతో, తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక పండుగ శోభ సంతరించుకుంటుందని సిఎం అన్నారు. ప్రకతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగ విశ్వ వ్యాప్తంగా చాటుతుందని సిఎం తెలిపారు. మహిళా సంక్షేమం అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు మహిళా సాధికారతను పెంపొందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచాయని సిఎం అన్నారు. తెలంగాణ ప్రజలందరి బతుకుల్లో వెలుగులు నింపుతూ, సుఖ సంతోషాలతో జీవించేలా దీవించాలని ప్రకతి మాతను ప్రార్థించారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం

- బిఆర్ఎస్ గెలిస్తేనే మెదక్ మరింత అభివృద్ధి
- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న పథకాలను కేంద్ర ప్రభుత్వంతో పాటు పొరుగు రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని వైద్యా ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి ఆయన సొంత గ్రామమైన యూసుఫ్ పేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డికి బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కేరళ, పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు చూసి ప్రశంసించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని సైతం ప్రధానమంత్రి కాపీ కొట్టారన్నారు. మెదక్ అభివృద్ధి కేవలం పద్మా దేవేందర్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. కొంతమంది నాయకులు డబ్బుతోనే గెలుస్తామనుకుంటున్నారని, మెదక్ ప్రజల ఆత్మ గౌరవాన్ని ఎవరూ కొనలేరని తెలిపారు. మెదక్ జిల్లా కెసిఆర్ ఆశీస్సులు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కృషితో దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో మెదక్ ప్రాంతవాసులు ఘనాపూర్ ఆనకట్ట సాగునీటి కోసం ధర్నాలు చేసి జీపులు కట్టుకొని హైదరాబాద్ వెళ్లేవారని, అప్పుడు కానీ సింగూరు నీరు ఘనాపూర్ ఆనకట్టకు వదిలే వారు కాదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తెచ్చి సింగూరు నీళ్లను మెదక్ జిల్లాకే వాడుకునేలా జీవో తెచ్చారని, దీంతో సింగూరు కింద ఘనాపూర్ ఆనకట్ట పరిధిలో రెండు పంటలు పండుతున్నాయని తెలిపారు. అప్పట్లో వ్యవసాయం దండగా అన్న నాయకుల నోటి నుంచి వ్యవసాయం పండుగ అనేలా ముఖ్యమంత్రి చేశారన్నారు. ఉచిత కరెంటు మేమే ఇచ్చామని రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అది ఉత్త కరెంటేనని ఎద్దేవా చేశారు. అప్పట్లో కరెంటు లేక సాగు నీరు అందక ఎకరాల కొద్ది పంట ఎండిపోయేదని, ప్రస్తుతం ఎక్కడ గుంట కూడా ఎండటం లేదన్నారు. తెలంగాణలో వేరే పార్టీని గెలిపిస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కరెంటు ఉండటం లేదని చెప్పారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మెదక్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తాము శశిధర్ రెడ్డి శాసనసభలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఒకసారి మెదక్ పట్టణంలో ప్రధానమంత్రి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా శశిధర్ రెడ్డి తాము ఒక వేదికపై ఉన్నామని మంత్రి గుర్తు చేశారు. వీరి ఆధ్వర్యంలో మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతం అవుతుందని, విజయం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.



మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డికి బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

ఊపిరితిత్తుల మార్పిడిలో యశోద రికార్డ్

- పురుగు మందు తాగిన వ్యక్తికి చికిత్స
- దేశంలోనే తొలిసారి..
- డైరెక్టర్ పవన్ గోరుకంటి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ఊపిరితిత్తుల మార్పిడిలో యశోద హాస్పిటల్ చరిత్ర సృష్టించింది. పురుగుల మందు తాగిని యువకుడికి రెండు ఊపిరిత్తులను విజయవంతంగా మార్పిడి చేసింది. విషం తాగిన వ్యక్తికి ఇలాంటి శస్త్ర చికిత్స దేశంలోనే తొలిసారి అని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కిషన్ గొనుగుంట్ల, ఇతర వైద్య సిబ్బందితో కలిసి పవన్ మాట్లాడుతూ.. కలుపు, గడ్డి నియంత్రణకు ఉపయోగించే "పారాక్వాట్" అనే ఒక విష రసాయనం సేవించి.. తీవ్ర ప్రాణాపాయంలోఉన్న 23 ఏళ్ల రోహిత్‌కు సంయుక్త ఊపిరితిత్తుల మార్పిడితో సరికొత్త జీవితాన్ని అందించామన్నారు. ప్రపంచంలోనే 4వ అరుదైన డబుల్ లంగ్ ట్రాన్స్ ప్లాంటేషన్ అని ఆయన తెలిపారు. ఇది యశోద హాస్పిటల్స్ చికిత్సలో ఓ చరిత్రగా నిలువనుందన్నారు. ఇది తెలుగు రాష్టాల వైద్య రంగానికే గర్వకారణమన్నారు. "పురుగు మందుతో రోహిత్ ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయనికి భారీ నష్టం జరిగింది. పారాక్వాట్ విషకణాలు చురుకుగా ఊపిరితిత్తులను చేరడం ద్వారా ఫలితంగా కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ ఏర్పడింది. శ్వాసకోశ వైఫల్యం పారాక్వాట్ మత్తు చివరి దశలో మరణానికి దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితులలో ఊపిరితిత్తుల మార్పిడి దేశంలో ఇదే తొలిసారి. ఇలాంటి సందర్భంలో ఊపిరితిత్తుల మార్పిడి జరిగిన కేసులు ప్రపంచవ్యాప్తంగా నాలుగు మాత్రమే ఉన్నాయని, అందులో ఎక్కువ కాలం జీవించి ఉన్న కేసు కూడా ఇదే మొదటిది. దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులు, మార్పిడిపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది." అని పవన్ గోరుకంటి తెలిపారు. "దేశంలో ఇలాంటి పరిస్థితి నుండి ఇంతవరకు ఎవరు బయటపడలేదు. ప్రాణాపాయస్థితిలో మా దగ్గరకు వచ్చిన రోహిత్‌ను మెకానికల్ వెంటిలేటర్‌పై వైద్యం అందించి, ఆ తర్వాత అదనపు కార్పోరల్ సపోర్ట్‌కు మర్చడం జరిగింది. అతను 15 రోజులకు పైగా ఎక్మో మద్దతు పొందినప్పటికీ ఎటువంటి మెరుగుదల లేకపోవడంతో ఊపిరితిత్తుల మార్పిడి చేయాల్సి వచ్చింది. నిర్దిష్ట పరీక్ష ద్వారా అతని శరీరంలో ఎటువంటి విషం మిగిలి లేదని నిర్ధారించుకున్న తర్వాత ఊపిరితిత్తుల మార్పిడికి మా వైద్యబృందం ప్రణాళిక వేసింది. తెలంగాణ జీవన్‌దాన్ సహాయంతో విజయవంతంగా శస్త్ర చికిత్స, మార్పిడి పూర్తి చేశాము" అని డాక్టర్ హరి కిషన్ తెలిపారు.



కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థులే లేరు

- 70 చోట్ల ఎలా గెలుస్తారు..? : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 40 చోట్ల అభ్యర్థులే లేని కాంగ్రెస్.. 70 చోట్ల గెలుస్తామని ఆ పార్టీ నాయకులు ఎలా చెబుతారని ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. "డబ్బులు ఇచ్చిన వారికే కాంగ్రెస్ టికెట్లు దక్కుతున్నాయి. కూకట్‌పల్లి సీటు కోసం రూ. 15 కోట్లు అడిగారని ఓ కాంగ్రెస్ నేత చెప్పారు. నేను చెప్పినట్టే కర్ణాటకలో అక్రమ డబ్బు జమ అవుతోంది. ఇప్పటికే రూ. ఎనిమిది కోట్లు కొడంగల్ చేరినట్టు సమాచారం ఉంది" అని కెటిఆర్ పేర్కొన్నారు. కెసిఆర్ వంద నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తారని తెలిపారు. జిహెచ్‌ఎంసి, సిరిసిల్ల, కామారెడ్డిలో తాను ప్రచారం చేస్తానని, ఎన్నికల నిర్వహణలో ఇసి స్వతంత్రంగా పని చేస్తుందని భావిస్తున్నా అని చెప్పారు. అధికారుల బదిలీలను సాధారణ బదిలీలుగానే చూస్తామన్నారు. హుజురాబాద్‌లోనూ తామే గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈటల రాజేందర్ 50 చోట్ల పోటీ చేసినా, షర్మిల 119 సీట్లలో పోటీ చేసినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ లీడర్ కాదు.. రీడర్ అని కెటిఆర్ విమర్శించారు. పొన్నాల లక్ష్మయ్య బిఆర్ఎస్‌లో చేరుతానంటే ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానిస్తానన్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత గాంధీ భవన్‌లో తన్నుకుంటారన్నారు. కాంగ్రెస్‌లో సిఎం పదవికి ఇద్దరి మధ్య అంగీకారం కుదిరినట్టు సమాచారం ఉందన్నారు. అమిత్ షా అబద్ధాలకు హద్దే లేదని కెటిఆర్ మండిపడ్డారు. బిజెపి 110 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడం ఖాయమని, బిజెపి సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందని తెలిపారు. బిజెపితో స్నేహముంటే మోదీని ఎందుకు తిడుతామని, మేం ప్రతీకార రాజకీయాలు చేయడం లేదని, రేవంత్ అక్రమాలపై ఐటి, ఇడి సోదాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఆరోగ్యంపై లోకేష్ ట్వీట్ బాధ కలిగించిందని పేర్కొన్నారు. కుమారుడిగా తండ్రి ఆరోగ్యంపై ఆందోళన ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. కెసిఆర్ నిరాహార దీక్ష సమయంలో తనకూ ఆందోళన కలిగిందని, హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలనే ఇక్కడ ఆందోళన వద్దని తాను సూచించినట్లు కెటిఆర్ వెల్లడించారు.



దళిత కుటుంబం గ్రామ బహిష్కరణ

- జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ దళిత కుటుంబాన్ని గ్రామ పెద్దలు గ్రామం నుంచి బహిష్కరించిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రామారావుపల్లెలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బాధితురాలు బద్ది నర్మద మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ భర్త, కొందరు గ్రామస్తులు తన కుటుంబంపై వ్యక్తిగతంగా, రాజకీయ కక్షతో గ్రామ బహిష్కరణ విధించారని తెలిపింది. గ్రామ పెద్దలైన పులి వెంకటి, ఒళ్లెం గంగారెడ్డి, పుప్పాల ప్రతాప్, ఒళ్లెం మల్లయ్య, ఇంద్రాల రాజనర్సయ్య, అవుదుర్తి చిన్న నర్సయ్య, కొండ శ్రీనివాస్, పొన్నం రాజేందర్ మొదలైన గ్రామపెద్ద మనుషులతో కలిసి కక్ష కట్టి తమ కుటుంబంతో ఎవరైనా మాట్లాడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని, కుటుంబానికి ఏవిధమైన సహాయ సహకారాలు అందించకూడదని తీర్మానించారని ఆవేదన వ్యక్తం చేసింది. తనను, తన కుటుంబాన్ని మనోవేదనకు గురిచేస్తున్న సర్పంచ్ భర్త, గ్రామ పెద్దలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపింది.

భారీగా నగదు, బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు చేస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, బంగారం లభ్యమవుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 9.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ చింతల కుంటలో 4 చోట్ల, సాగర్ రింగ్ రోడ్డులో చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ. 28,99,640 నగదును పోలీసులు సీజ్ చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో ఓ కారులో రూ. 12 లక్షలు విలువ చేసే 20 తులాల బంగారం, 9 వేలు విలువచేసే పన్నెండున్నర తులాల వెండి ఆభరణాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటిసి పోలీసు స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ వద్ద తనిఖీలు చేస్తుండగా ఓ ద్విచక్రవాహనంలో రూ. ఐదు లక్షలు, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి శివారెడ్డిగూడ వద్ద ద్విచక్రవాహనంలో రూ. మూడు లక్షలు పట్టుబడ్డాయి. జవహర్ నగర్ కార్పొరేషన్ చెన్నాపురం చౌరస్తా తనిఖీల్లో రూ. ఆరు లక్షలను పోలీసులు సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా అదే సమయంలో ఆటుగా వెళుతున్న నాగారం ఎక్స్‌రోడ్డు సమీపంలో డి.కొత్తపల్లి ఆవాసం బీమ్లాతండాకు చెందిన ఇద్దరు మహిళల తమ హ్యాండ్ బ్యాగ్‌లను బ్యాగ్‌లను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి రూ.9.90లక్షల నగదును సీజ్ చేసి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్దెల ముత్తయ్యకు అప్పగించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.కోటిన్నరకుపైగా నగదును పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి మండలంలో వాహనాల తనిఖీల్లో ఎరుకల వెంకటేష్ అనే వ్యక్తి నుంచి రూ.90 వేలు సీజ్ చేశారు.




నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

తండ్రి ఒకచోట.. తల్లి మరో చోట

- పిల్లలకు విషమిచ్చి చంపి.. వారూ ఆత్మహత్య
- హైదరాబాద్‌లో ఒకే రోజూ రెండు విషాద ఘటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఒకే రోజు రెండు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. కుటుంబకలహాలతో ఒక చోట ఓ తండ్రి తన ఇద్దరు కూతుళ్లకు నిద్ర మాత్రలు ఇచ్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకోగా, మరో ఘటనలో ఓ తల్లి మానసిక ఎదుగులా సరిగా లేదని తన ఇద్దరు కొడుకులకు విషమిచ్చి చంపి తర్వాత తానూ ఉరేసుకుని చనిపోయింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓల్డ్ బోయిన్‌పల్లి భవాని నగర్‌లో శ్రీకాంత్ చారి (42) తన భార్య అక్షయ, ఇద్దరు కూతుర్లు స్రవంతి (8) శ్రావ్య (7)తో కలిసి నివసిస్తున్నారు. అతను వెండి షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొన్ని రోజుల నుంచి భార్య, భర్తల మధ్య ఆర్థిక విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీకాంత్ చారి గురువారం రాత్రి సైనైడ్ తీసుకొచ్చి నిద్రలో ఉన్న కూతుర్లు స్రవంతి, శ్రావ్యకు తాగించాడు. పిల్లలు చనిపోవడంతో సైనైడ్‌ను భార్యకూ ఇవ్వబోయాడు. భార్య తప్పించుకుని కిందికి వెళ్లిపోవడంతో శ్రీకాంత్ దాన్ని సేవించి అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటన.. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకుంది. బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం బోరబండ పిఎస్ పరిధిలోని రాజ్ నగర్ కాలనీలో నివాసముండే జ్యోతి (32) ప్రభుత్వ స్కూల్ టీచర్‌గా బంజారాహిల్స్‌లో పనిచేస్తున్నారు. ఆమెకు ఐదేళ్ల క్రితం మేనబావ విజయ్ కుమార్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు అర్జున్ (4), ఆదిత్య (1). అయితే ఇద్దరు పిల్లల మానసిక ఎదుగుదలా సరిగ్గా లేదు. వివిధ హాస్పిటల్‌ల్లో చికిత్స చేయించినప్పటికీ ప్రయోజనం కలగలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం జ్యోతి తన ఇద్దరు కుమారులకు పాలలో విషం కలిపి ఇచ్చి, వారు చనిపోయారని భావించి బెడ్‌రూమ్‌లో డోర్ పెట్టుకొని కిటికీకి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భర్త విజయ్ కుమార్, కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి ముగ్గురూ చనిపోయి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని క్లూస్ టీంతో క్షుణ్ణంగా తనిఖీ చేయించి పాయిజన్ బాటిల్‌ను, విషపు పాలను సీజ్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



'గులాబీల జెండాలే రామక్క' పాట విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చావు నోట్లో తల పెట్టి తెలంగాణ ఉద్యమంలో సిఎం కెసిఆర్ చేసిన పోరాటాన్ని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆయన సారథ్యంలో రాష్ట్రంలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని పాట రూపంలో కళ్లకు కట్టినట్టు చూపించే 'గులాబీల జెండలే రామక్క' అనే పాటను మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు శుక్రవారం ప్రగతి భవన్‌లో విడుదల చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబించేలా ఈ పాట ఉందని పాట పాడిన నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, తాండ్ర గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మమ్మ, బొల్లె సుశీల, శాంతమ్మ, కలమ్మ, అనసూయలను వారు అభినందించారు. తమ గానంతో ఆకట్టుకున్న కొమ్ము లక్ష్మమ్మ బృందానికి మంత్రి కెటిఆర్ పోచంపల్లి చీరలను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

2021 తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021 ఏడాదికి సాహితీ పురస్కారాలను ప్రకటించింది. పద్యకవితా ప్రక్రియలో డాక్టర్ మాడుగుల అనిల్‌కుమార్ (శ్రీగిరిజా కళ్యాణం), వచన కవితా ప్రక్రియలో తండా హరీశ్‌గౌడ్ (ఇన్‌బాక్స్), బాలసాహిత్యంలో మాచిరాజు కామేశ్వరరావు (పాపిష్టిడబ్బు), కథానికా ప్రక్రియలో అలాడి శ్రీనివాస్ (ఎడారిపూలు), నవలా ప్రక్రియలో అట్టాడ అప్పలనాయుడు (బహుళ), సాహిత్య విమర్శలో కెపి అశోక్‌కుమార్ (తెలుగు నవల ప్రయోగవైవిధ్యం), నాటకం ఎస్‌డివి అజీజ్ (తుర్రెబాజ్‌ఖాన్), అనువాద సాహిత్యంలో స్వర్ణ కిలారి (లిప్తకాలపు స్వప్నం), వచన రచనల విభాగంలో కోడం పవన్‌కుమార్ (కరోనా లాక్‌డౌన్.360), రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో విజయ భండారు (గణిక) గ్రంథాలు సాహితీ పురస్కారానికి ఎంపికయ్యాయని ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వర్సిటీ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పురస్కారంగా ఒక్కొక్కరికీ రూ.20,116 నగదు అందజేసి సత్కరిస్తామని తెలిపారు. సాధారణ పాఠకుల నుంచి కవులు, రచయితలు, విమర్శకులు, నాటకకర్తల నుంచి సూచనలు స్వీకరించి 2018, 2019, 2020 ఏడాదిలో వెలువడ్డ పుస్తకాలను సేకరించి న్యాయ నిర్ణేతలతో వివిధ దశల్లో పురస్కారాల ఎంపికను నిర్వహించామని వివరించారు.

కొల్లాపూర్ కోటలో బిగ్‌ఫైట్

- ఎమ్మెల్యే బీరం, మాజీ మంత్రి జూపల్లి మధ్యనే గట్టి పోటీ
- టిడిపి, బిజెపి, బిఎస్‌పి సైతం పోటీలో
- ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు ప్రయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొల్లాపూర్ కోటలో తిరిగి చక్రం తిప్పేదెరో అంటూ తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు అందించే కొల్లాపూర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతం ఆంధ్రా సరిహద్దు కావడంతో పాటు కృష్ణానది సమీపంలో ఉండడంతో దీనిపై పలుపార్టీలు గురిపెట్టి ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ముందుకు కదులుతున్నాయి. కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి, బిఎస్‌పి, ప్రజాపార్టీ రంగంలో ఉండి గెలుపు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే సమన్వయం లేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశాలున్నాయని పలువురు రాజకీయ నాయకులు అంటున్నారు. కొల్లాపూర్ ప్రాంతాన్ని దశాబ్దాల పాటు సురబి వంశీయులు పరిపాలిస్తూ వచ్చారు. 41 ఏళ్ల వెలమల పరిపాలన కొనసాగింది. 1952లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం ఏర్పడింది. ఏడు మండలాలు, 133 గ్రామ పంచాయతీలుండగా.. మొత్తం 2,29,399 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,16,975 మంది, మహిళలు 1,12,420 మంది ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 1952 నుంచి 2018 వరకు ఉప ఎన్నికలు కలుపుకొని 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తొమ్మిది సార్లు గెలుపొందింది. 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో అనంత రాంచంద్రారెడ్డి సోషలిస్టు కమ్యూనిస్టు పార్టీ నుంచి గెలుపొందారు. 1967లో నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం 1999, 2004, 2009, 2012, 2014లో జరిగిన ఎన్నికల్లో జూపల్లి కృష్ణారావు 19 సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొనసాగారు. కాగా కొల్లాపూర్ నుంచి మూడు దశాబ్దాల పాటు ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు 2018లో కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. మూడు నెలలు తిరగకుండానే బీరం బిఆర్‌ఎస్‌లో చేరిపోయారు. అధికార బిఆర్‌ఎస్ పార్టీలో తనకు ప్రాధాన్యత లేదన్న కారణంతో జూపల్లి కాంగ్రెస్ కుండువా కప్పుకున్నారు. అయితే మొన్నటి వరకు కాంగ్రెస్‌లో ఉన్న రంగినేని అభిలాష్‌రావు, జూపల్లి విధానం నచ్చకపోవడంతో తిరిగి సొంతగూడు బిఆర్‌ఎస్‌లోకి చేరిపోయారు. ఇతని స్థానంలో మరో ఎన్‌ఆర్‌ఐ కొత్త కల్యాణ్‌రావు.. జూపల్లి పక్షాన చేరారు. మరో నాయకుడు నక్క వేణుగోపాల్ సైతం కృష్ణారావుకు మద్దతు ఇస్తున్నారు. అలాగే, స్కాలర్ స్కూల్ యజమాని రాముయాదవ్ జూపల్లికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. ఇలా ఎంతో మంది మద్దతు కూడగొట్టుకుంటున్న జూపల్లి.. ఉమ్మడి జిల్లాలో అత్యధిక సీట్లు సాధించి అధికార పార్టీకి జలక్ ఇవ్వాలన్న తలంపుతో ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయన్న దీమాలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు. మారుమూల గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణాలు పూర్తి చేయలేదనే విమర్శ ఉంది. కాగా, ఇతనికి మాజీ కాంగ్రెస్ నాయకులు రంగినేని అభిలాష్‌రావు మద్దతు సంపూర్ణంగా ఉంది. సింగిల్ విండో చైర్మెన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి సైతం బీరంకు అండగా ఉండే అవకాశాలు ఉన్నాయి. కాగా, బిజెపి నుంచి ఎల్లేని సుధాకర్‌రావు పోటీ పడుతున్నారు. ఇతనికి గతం కంటే ఓట్లు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిడిపి నుంచి పగడాల శ్రీనివాసులు, బిఎస్‌పి నుంచి శేఖరయ్య, ప్రజాపార్టీ నుంచి బింగి సోమన్న బరిలో నిలవనున్నారు. ఇక కాంగ్రెస్‌లో నాయకులు జగదీశ్వర్‌రావుకు అదిష్టానం టికెట్ నిరాకరించడంతో ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇతనికి ఎంపిపి సోమేశ్వరరావు, గౌరారం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపి సుదారాణిలు మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయి.




వామపక్ష ఓట్లు కీలకం

- శివవర్మ, సిపిఎం మండల కార్యదర్శి, కొల్లాపూర్

కొల్లాపూర్ నియోజకవర్గం మొదటి నుంచి అభ్యుదయ వాదుల నిలయంగా ఉంది. ఇక్కడ సిపిఎంకు మంచి పట్టు ఉంది. గెలుపోటములకు సిపిఎం కీలకం కానుంది. అనేక ఉద్యమాలు చేసిన పార్టీగా ప్రజలకు అభిమానముంది. సిపిఎంకు ప్రజా సంఘాలు, మేధావులు, పలు ప్రజాసంఘాల మద్దతు ఉంది.

కాంగ్రెస్ ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా గెలిచేది బిఆర్‌ఎస్సే..

- మంత్రి హరీష్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎన్నికల్లో డబ్బు పంచి గెలించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమంగా సంపాదించిన డబ్బును తెలంగాణకు చేరవేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో జరిగిన ఐటీ దాడుల్లో డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన అంబికా పతి, ఆయన భార్య అశ్వత్త ఇంట్లో రూ. 52 కోట్లు పట్టుబడ్డాయని మంత్రి తెలిపారు.

కర్ణాటకలో గతంలో అధికారంలో ఉన్న బిజెపి కాంట్రాక్టర్ల వద్ద 40 శాతం కమీషన్ వసూలు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ 50 శాతం వసూలు చేస్తుందని ఆరోపించారు. ఇలా కాంగ్రెస్ పార్టీ స్కాంగ్రెస్‌గా మారిందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టికెట్‌లు అమ్ముకొంటున్నట్టు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్ని నోట్ల కట్టలు పంచినా, ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో ముచ్చటగా మూడోసారి గెలిచేది బిఆర్‌ఎస్ పార్టీనే అని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.



మంజులమ్మ భౌతికకాయంకు నివాళులర్పిస్తున్న సిఎం కెసిఆర్

మంత్రి వేముల తల్లికి కన్నీటి వీడ్కోలు

- పుష్పాంజలి ఘటించిన సిఎం కెసిఆర్, మంత్రులు, పలువురు ప్రముఖులు

పజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం వారి స్వగ్రామం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ వేల్పూర్‌కు వచ్చి మంజులమ్మ భౌతికకాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సిఎంతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్య సభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జజాల సురేందర్, హన్మంతు షిండే, షకీల్, విద్యాసాగర్ రావు, పలువురు అధికారులు, రాష్ట్ర ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి పలువురు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మెన్లు, ఎంపి ధర్మపురి అరవింద్, తదితర ముఖ్య నాయకులు హాజరై నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వేల సంఖ్యలో ప్రజలు వేముల కుటుంబం అభిమానులు అంత్యక్రియలకు హాజరయ్యారు. మంజులమ్మకు అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

- సమాఖ్య చైర్మన్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని బలహీన వర్గాలకు చెందిన సహకార సంఘాలను ఉన్నతంగా తీర్చిదిద్ది ఆ సంఘాలలో సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం హితోధికంగా కృషి చేస్తోందని పలువురు సహకార సంఘాల సమాఖ్య చైర్మన్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, కల్లు గీత కార్మికుల సమాఖ్య చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గొర్లు, మేకల వృత్తిదారుల సహకార సంఘం సమాఖ్య చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఈ మేరకు ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వం బలహీన వర్గాల వృత్తిదారుల సంక్షేమానికి అమలు జరుపుతున్న పథకాలపై చర్చించినట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల, వృత్తిదారుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు జరుపుతోందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం దేశంలో వెనుకబడిన తరగతుల ప్రజల సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదని విమర్శించారు.

'బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో'లో సిఐటియు జయకేతనం

- పరిశ్రమ ఎదుట టపాకాయలు కాలుస్తూ.. స్వీట్లు పంచుతూ సంబురాలు
- బిఎంఎస్ అబద్దపు ప్రచారాన్ని కార్మికులు నమ్మలేదు : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలోని నందికంది గ్రామ శివారులో ఉన్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు జయకేతనం ఎగురవేసింది. బిఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ మల్లేశంపై సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం ఘన విజయం సాధించారు. కంపెనీలో 115 ఓట్లు పోలైతే అందులో బిఎంఎస్‌కు 57, సిఐటియుకు 58 ఓట్లు వచ్చాయి. దాంతో సిఐటియు కార్యకర్తలు కంపెనీ ఎదుట టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంచుతూ సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ బిఎంఎస్ చేసిన అసత్యపు, అబద్ధపు ప్రచారాన్ని కార్మికులు నమ్మలేదన్నారు. నీతి నిజాయితీతో కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సిఐటియునే కార్మికులు గెలిపించుకున్నారన్నారు. ఇతర సంఘం వారు కార్మికులను అనేక ప్రలోభాలకు గురిచేసినా.. చుక్క గుర్తుకే ఓటు వేశారని తెలిపారు. ఈ విజయం కార్మికుల విజయమన్నారు. కంపెనీలో మెరుగైన వేతన ఒప్పందానికి, కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బీరం మల్లేశం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి మల్లికార్జున్, కార్యదర్శి జి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్, నాయకులు నర్సింలు, సంతోష్, మల్లేష్, శ్రీనివాస్, శ్రీధర్, బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్ శ్రీనివాస్, జి.శ్రీనివాస్, వీరేశం, సంజీవరావు, జోసెఫ్, జనార్ధన్, నర్సింలు, సాయిలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో కంపెనీ కార్మికులు

అన్ని రంగాల్లో బిఆర్‌ఎస్ సర్కారు విఫలం

- టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ కుసుమ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ కుసుమకుమార్ విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి అబద్దాలు మాట్లాడుతున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎఐసిసి అధికార ప్రతినిధి డోలిశర్మ, ఎఐసిసి మీడియా పరిశీలకులు గౌతమ్ సేథ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు హామిలిచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ హామీల అమలులో విఫలమయ్యారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల్లో తెలంగాణ నెంబర్ వన్ అన్నారు. మహిళల కోసం వెల్ఫేర్ బోర్డు చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ కేవలం మాటలు మాత్రమే చెబుతారనీ, బిఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోనూ అబద్దాలు చెబుతారని ఆరోపించారు.



నర్సింహారావు (ఫైల్‌ఫోటో)

విద్యుద్ఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు వేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే రైతు మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పోతునూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతునూర్ గ్రామానికి చెందిన పెండ్యాల నర్సింహారావు (67) తన వ్యవసాయ భూమిలో బోర్ మోటార్‌కు కరెంట్ రావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్‌ను బందు చేసి వైర్లు జాయింట్ చేయడానికి పైకి ఎక్కి రిపేర్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి చేతులు, కాళ్లకు, ఛాతిపై తీవ్ర కాలిన గాయలై అక్కడికక్కడే మరణించారు. ఆయన భార్య పెండ్యాల సుమతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహారావు కుమారుడు ఉన్నాడు.

డిఎస్‌సి వాయిదా

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖ నిర్ణయం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ యథాతథం
- ఈ నెల 21 వరకు తుదిగడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డిఎస్‌సి) రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. వచ్చేనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో అదేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ప్రకటించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే డిఎస్‌సి రాతపరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే ప్రక్రియ యథాతథంగా కొనసాగుతుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. వాటి సమర్పణకు ఈనెల 21 వరకు తుదిగడువు ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 80 వేల దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డిఎస్‌సి) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఎనిమిదో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చేనెల 20,21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు, అదేనెల 22న స్కూల్ అసిస్టెంట్ అన్ని లాంగ్వేజ్ సబ్జెక్టులకు, 23న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఇటి) అభ్యర్థులకు, 24న లాంగ్వేజ్ పండితులకు, 25 నుంచి 30 వరకు ఆరు రోజులపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) అభ్యర్థులకు రాతపరీక్షలను నిర్వహించాలని విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 30న ఉండడంతో డిఎస్‌సి రాతపరీక్షలు అనివార్యంగా వాయిదా పడ్డాయి. ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరగాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) వాయిదా వేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది.

22న కళా దర్బార్ సంగీత పురస్కారాలు

ప్రజాశక్తి - కల్చరల్

ఈ నెల 22న ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా దర్బార్ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన మందిరంలో ప్రముఖ గాయనీ గాయకులకు స్వర రత్న, సంగీత సేవా రత్న, సంగీత గాన రత్న పురస్కారాలు బహూకరించనున్నట్లు సంస్థ స్థాపకుడు పొత్తూరి రంగారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ పాల్గొనగా రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణు గోపాలాచారి,నటులు సుమన్, కవిత, సుచరిండియా కిరణ్, వ్యాపార వేత్తలు నరేంద్ర కుమార్,హరి బాబు కొమ్మల పాటి శ్రీధర్ తదితరులు పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన కర పత్రిక ను చిక్కడపల్లిలోని ఒక హోటల్ లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో రంగారావుతో కలసి గాయకులు శశికళ, మాధవి సురేఖ, శారదా సాయి,రమణ శీలం, చింతల పాటి సురేష్ లతో కలసి ఆవిష్కరించారు

అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తాం

- కోదండరెడ్డి, నిరంజన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉన్న అసైన్డ్‌భూములకు హక్కులు కల్పిస్తామని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ చెప్పారు. ఈ విషయాలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరుస్తామన్నారు. సమగ్ర భూసర్వే నిర్వహిస్తామని చెప్పారు. కౌలు రైతులను గుర్తిస్తామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను కాంగ్రెస్ తూ చా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు హామీలిచ్చిన వాటిని విస్మరించాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో మ్యానిఫెస్టోలతో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.రాష్ట్రంలో రెవిన్యూ వ్యవస్థను ధరణి పేరుతో బిఆర్‌ఎస్ సర్కారు అస్తవ్యస్తం చేసిందన్నారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

మ్యాక్స్ 'అన్‌బిలీవబుల్' క్యాంపెయిన్

ముంబయి : ప్రముఖ ఫ్యాషన్ రిటైల్ బ్రాండ్ మ్యాక్స్ ప్రస్తుత పండుగ సీజన్ కోసం "అన్‌బిలీవబుల్" పేరుతో నూతన ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. గరిష్ట శైలీ, కనిష్ట ధరలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నట్లు మ్యాక్స్ ఫ్యాషన్ ఇండియా ప్రతినిధి పల్లవి పాండే పేర్కొన్నారు.

బిగ్ సి దసరా ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా స్టోర్లతో రిటైల్ మొబైల్ విక్రయాల్లో దూసుకుపోతున్న బిగ్ సి దసరా సందర్భంగా ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ సిఎండి యం.బాలు చౌదరి మాట్లాడుతూ, ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.10వేల వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.4వేల విలువైన గ్యారెంటీ బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ ధమాకా ఆఫర్లలో ప్రతి స్మార్ట్ ఫోన్ , టివి, ల్యాప్‌టాప్ కొనుగోలుపై స్మార్ట్ వాచ్ ఆఫర్, 5శాతం ఇన్‌స్టెంట్ డిస్కౌంట్ ఆఫర్, లాయల్టీ పాయింట్స్ ఆఫర్, వన్ ప్లస్ వన్ ఎక్స్‌టెండ్ వారెంటీ ఆఫర్, స్మార్ట్ టివి ఆఫర్‌లాంటి ఎన్నో ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా షాపింగ్ చేసేవారికి, ఎటిఎం కార్డు వినియోగించేవారికి ఎటువంటి వడ్డీ లేకుండా ఆకర్షణీయమైన ధరలు అందుబాటులో ఉన్నాయని సిఎండి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



'స్మార్ట్' బెట్టింగ్..!

- నేడు ఇండో- పాక్ క్రికెట్ మ్యాచ్‌పై రూ.కోట్లలో లావాదేవీలు
- స్మార్ట్‌ఫోన్లలోనే సాగుతున్న వ్యవహారం
- మాఫియా మాయలో యువత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరల్డ్ కప్ క్రికెట్‌లో అత్యంత కీలక ఇండో పాకిస్తాన్ మ్యాచ్ శనివారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌పై రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు వేదికగా భారీగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దానికి సంబంధించిన బెట్టింగ్‌లు కూడా సాగుతున్నాయి. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రాల వారీగా బెట్టింగ్ యాప్‌లూ అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ ఎన్నికల బెట్టింగ్ యాపుల్లోనూ భారీగా లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఇటు క్రికెట్, అటు పొలిటికల్ బెట్టింగ్ యాప్‌ల ప్రభావం ప్రధానంగా యువతీ యువకులపై అధికంగా ఉంటుంది. బాల్ బాల్ బెట్టింగ్ మొదలు మ్యాచ్ ముగింపు వరకు ప్రతి మలుపుపై పందేలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఏ బ్యాటర్ ఎన్ని పరుగులు చేస్తారు? తుది జట్టు ఎలా ఉంటుంది? ఏ బౌలర్ ఎన్ని రన్స్ ఇస్తారు..? ఇలా ప్రతి అంశంపైనా బెట్టింగ్‌ల నిర్వహణకు యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు ఎన్నికల బెట్టింగ్ యాప్‌లలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఎన్ని సీట్లు వస్తాయి? తదితర అంశాలతో వీటిని రూపొందించారు. ఇదే అదనుగా బెట్టింగ్ మాఫియా పురి విప్పుతోంది. యువత ఫలితం తేలే వరకు టివిలు, స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ తరుణంలోనే జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ రాయుళ్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఆయాచిత సొమ్ముకు ఆశపడి పందేలు కాస్తున్నారు. బెట్టింగ్ మాఫియా వలలో సులువుగా చిక్కుకుంటున్నారు.

బాల్ బాల్‌కూ బెట్టింగ్..

మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ గెలవడం నుంచి బాల్ బై బాల్, ఓవర్ బై ఓవర్ అంటూ తుది విజేత తెలిసే వరకు వివిధ రకాలుగా బెట్టింగ్‌కు దిగుతున్నారు. దీనికితోడు సెల్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చిన క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా మరికొందరు యథేచ్ఛగా జూదాలకు పాల్పడుతున్నారు. సులువైన సంపాదనే లక్ష్యంగా పందేలకు అలవాటు పడి చేతి చమురు వదిలించుకుంటున్నారు. చివరకు తమ కుటుంబాలను వీధిన పడేయడమే కాకుండా, ప్రాణాలు తీసుకునే దుస్థితికి చేరుకున్న ఉదంతాలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నాయి.

హిడెన్ యాప్‌లే కీలకం

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు అనేకం ఉన్నాయి. వీటిలో రూ.పది వేల నుంచి బెట్టింగ్ చేసే వెసులుబాటు ఉంది. ఇవి చాలా వరకు హిడెన్ మోడ్‌లోనే ఉంటాయి. పోలీసులు తనిఖీ చేసినా ఈ యాప్‌లు కనిపించవు. ఒకప్పుడు పెద్ద నగరాలకు మాత్రమే బెట్టింగ్ విధానం ఉండేది. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో బెట్టింగులు అధికంగా సాగుతున్నట్టు సమాచారం. ఆయా పట్టణాల్లోని శివారు ప్రాంతాలు, పందెంరాయుళ్ల కొన్ని లాడ్జీల్లో రూములు, అపార్ట్‌మెంట్‌లలో ప్లాట్లు అద్దెకు తీసుకుని యథేచ్ఛగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలిసింది. హైవేల్లో దాబాల్లో సైతం పందెంరాయుళ్లు మకాం వేస్తున్నట్టు వినిపిస్తోంది. ఇక గ్రామాల్లో అయితే పొలాలు, చెరువు గట్లు, కొందరు ఇళ్లలోనే కాయ్ రాజా కాయ్ అంటున్నట్టు తెలుస్తోంది.

కోడ్‌లతో లావాదేవీలు

చాలా వరకు పందేలు కోడ్‌లతోనే నిర్వహిస్తున్నారు. గెలిచే జట్టును ఫ్లయింగ్, ఓడిన జట్టును ఈటింగ్, రూ.వెయ్యిని ఫింగర్, రూ.పది వేలను బోన్, రూ.లక్షను లెగ్ అని పిలుస్తారు. ఫోన్ పే, జీ పే ద్వారా నగదు లావాదేవీలు సాగిస్తున్నారు. ఖమ్మంలోని నిజాంపేట ప్రాంత వాసులు, రాజస్థానీ వ్యాపారులు, నగర శివారు ప్రాంతాల్లో అధికంగా క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, సత్తుపల్లి సింగరేణి బెల్ట్‌లో నేటి మ్యాచ్‌పై కోట్లలో పందేల లావాదేవీలు సాగుతున్నట్టు సమాచారం. యువతీ యువకులు, ప్రయివేటు, ప్రభుత్వ ఉద్యోగులు, అసంఘటిత రంగాల వర్కర్లు బెట్టింగ్‌లకు ఎక్కువగా పాల్పడుతున్నట్టు సమాచారం.

పొలిటికల్ బెట్టింగ్ యాప్‌లు..

ఎన్నికల నేపథ్యంలో పొలిటికల్ బెట్టింగ్ యాప్‌లు సైతం అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటిలో ప్రధానంగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఎన్ని సీట్లు సాధిస్తుంది? కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వస్తాయి? బిఆర్‌ఎస్ ఎన్ని స్థానాలు దక్కించుకుంటుంది. ప్రధాన పార్టీల బలాబలాల పైన బెట్టింగులు సాగుతుంటాయి. ఇవి కాక స్థానికంగా హాట్ నియోజకవర్గాలు.. వాటిలో అభ్యర్థులు.. వారిలో గెలుపొందేవారు.. ఓడేవారు.. మెజారిటీలు.. ఇలా డిఫరెంట్.. డిఫరెంట్ బెట్టింగ్ లోకల్‌గా సాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనే అంశం పైనా భారీగా బెట్టింగులు సాగుతున్నట్టు తెలుస్తోంది.

అనాథలకు అన్నపూర్ణ డొక్కా సీతమ్మ

ప్రజాశక్తి - కల్చరల్

మధర్ థెరిసా గురించి, ఆమె సేవా తత్పరత గురించి గొప్పగా కొనియాడుతాం, కానీ తెలుగు జాతిలో అరుదైన మాణిక్యం డొక్కా సీతమ్మ త్యాగనిరతి గురించి మాత్రం ఏ కొద్ది మందికో మాత్రం తెలియడం బాధాకరమని పర్యాటక అభివృధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అవేదన వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయులు కార్యక్రమంలో భాగంగా డొక్కా సీతమ్మ సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గుప్త పాల్గొని మాట్లాడుతూ అనాథల పాలిట అన్నపూర్ణగా డొక్కా సీతమ్మ గోదావరి జిల్లాలలో ప్రతి నిత్యం వేలాది మందికి ఆహారం అందిస్తూ వారిని ఆకలి బాధను తీర్చే వారని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ అన్నార్తుల కోసం తన సంపద నంతా ధారపోసిన పుణ్యాత్మురాలు సీతమ్మ జీవితం నేటి తరాలకు తెలియక పోవటం బాధాకరమని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై వైఎస్‌ఆర్ మూర్తి, శ్రీమణి పాల్గొన్నారు



పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్ గుప్త